ప్రజాశక్తి

గురువారం 16 మే 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మమకారంతో వచ్చి.. సజీవ దహనమై..

- టిప్పర్, బస్సు ఢీకొని ఆరుగురు మృత్యువాత
- మృతుల్లో ఐదుగురు బాపట్ల జిల్లా వాసులు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- ఓటు వేసి వెళ్తుండగా చిలకలూరి పేట వద్ద ఘటన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సొంతూరిపై మమకారం.. ఓటు వేయాలనే లక్ష్యంతో వారంతా స్వగ్రామాలకు వచ్చారు. తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బంధుమిత్రులు, పిల్లలతో రెండు, మూడు రోజుల పాటు సరదాగా, సంతోషంగా గడిపారు. ఉద్యోగ విధులకు వెళ్లాలని తాము పనిచేసే ప్రాంతాలకు ఓ ప్రైవేటు టావెల్స్ బస్సులో మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యలోనే మృత్యువు టిప్పర్ రూపంలో దూసుకొచ్చింది. బస్సు, డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌తో సహా ఆరుగురి ప్రాణాలను బలిగొంది. బస్సులోని మిగతా ప్రయాణికులు కళ్లు తెరిచేలోపే అగ్ని కీలలు ఎగసి పడ్డాయి. ఈ ఘటనలో సుమారు 20 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమై 108 సిబ్బందికి సమాచారం అందించారు.

కాలి బూడిదైన మృతదేహాలు

మంటల్లో కాలిపోయిన బస్సు, టిప్పర్

క్షతగాత్రుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా చినగంజాం మండలం నీలయాపాలెం, చినగంజాం, గొనసపూడి గ్రామాలకు చెందిన 40 మందితో ప్రైవేటు ట్రావెల్ చిలుకలూరి పేట మీదుగా హైదరాబాదుకు బయలు దేరింది. ఆ బస్సు బుధవారం వేకువజాము 2 గంటల సమయంలో చిలకలూరిపేట సమీపంలోకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న టిప్పర్, బస్సు ఢీకొన్నాయి. దీంతో చిన్నగంజాం మండలం నీలాయ పాలెంకు చెందిన భార్యాభర్తలు ఉప్పుగుండూరి కాశీ బహ్మేశ్వరరావు (63), లక్ష్మి (55), వారి మనుమరాలు ముప్పరాజు ఖ్యాతి శ్రీసాయి (7), అదే మండలం గొనసపూడి గ్రామానికి దావూలూరి శ్రీనివాసరావు (34), మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ హరిసింగ్ సజీవ దహనమయ్యారు. తీవ్రంగా గాయపడిన చీరాలకు చెందిన చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ (45) హాస్పిటల్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక శకటం ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే బస్సు, టిప్పర్ కాలిబూడిదయ్యాయి. వాడరేవు, పిడుగురాళ్ళ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో తారు రోడ్డుపై మట్టి పేరుకుపోవడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులు చిలకలూరిపేట, గుంటూరు వైద్యశాలల్లో చికిత్స పొందు తున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాశీ బహ్మేశ్వరరావు (ఫైల్)

ఉప్పుగుండూరి లక్ష్మి (ఫైల్)

ముప్పరాజు ఖ్యాతి శ్రీసాయి (ఫైల్)

దావూలూరి శ్రీనివాసరావు(ఫైల్)

పోషణ భారమై.. కబేళాలకు పశువులు..

- ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 వేలు
- గ్రాసం లేక బక్కచిక్కుతున్న మూగ జీవాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతులకు పశుపోషణ భారంగా మారింది. పశుగ్రాసం కోసం తిప్పలు పడుతున్నారు. పాడి పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. రాయితీలు, పథకాలు దూరమయ్యాయి. పశు గ్రాసం దొరక్కపోవడంతో గేదెలు బక్కచిక్కి పాల దిగుబడి తగ్గుతోంది. రైతులకు ఆర్థిక చేయూతనిచ్చేలా గతంలో గోకులం పథకం పేరుతో ఉపాధి హామీ నిధులతో పశువుల క్షేత్రాలను రాయితీలతో నిర్మించారు. ప్రస్తుతం ఆ పథకాలను నిలిపివేయడంతో రైతులకు పశుపోషణ మరింత భారంగా మారింది. రాయితీలపై అందించే పాతర గడ్డి సరఫరా నిలిపి వేశారు. పశు నష్టపరిహారం పథకానికి నిధులు నిలిపేసి పలుమార్పులతో బీమా పథకాన్ని తీసుకొచ్చారు. ప్రీమియం పథకాలు అమలు కావడం లేదు. గతంలో పశువులకు నీడనివ్వడానికి గోకులాలు ఎంతగానో ఉపయోగపడేవి. పశుగ్రాసం కోసం గడ్డి విత్తనాలు రాయితీలతో అందించేవారు. పశు గ్రాసం కూడా రాయితీతో గ్రామాలకు చేర్చేవారు. కానీ ఈ పథకాలన్నీ ఆపివేయడంతో పాడి పరిశ్రమపై ఆధారపడిన వారికి భారం అధికమైంది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో కలిపి 16,500 ఆవులు, 69 వేల గేదెలు, 2 లక్షల 30 వేలు గొర్రెలు, లక్షా పది వేల మేకలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 8,680 మంది పాడి రైతులు ఉన్నారు. గతంలో రైతులు పశు పోషణ కోసం జొన్న, కొర్ర, పిల్లి పెసర తదితర పంటలు సాగు చేసేవారు. ఆ పంటల సాగు చేయడానికి ఖర్చులు అధికమవుతుండడంతో వీటిపై రైతులు విముఖత చూపారు. ఫలితంగా పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరిగాయి. పోషణ భారమై పశువులను అమ్ముతున్నారు. ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 వేలు పలుకుతోంది. కృష్ణా జిల్లా నుంచి ఈ ప్రాంతానికి తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రతిరోజూ నియోజకవర్గంలో సీజన్‌ను బట్టి 50 ట్రాక్టర్ల వరిగడ్డి విక్రయాలు జరుగు తున్నాయి. వరిగడ్డి ధర అధికంగా పలకడంతో రైతున్నకు పశు పోషణ భారమై పశువులను కబేళాలకు అమ్ముతున్నారు. కొంతమంది పశువులను తక్కువ ధరలకు అమ్ముకోలేక మేత కోసం పొలాల గట్టుల్లోకి తోలుకుపోయి వాటి కడుపు నింపుతున్నారు. ప్రభుత్వం పాల రేటు పెంచిందే తప్ప, పోషణకు ఎలాంటి ప్రోత్సాహం అందించ లేదు. వ్యవసాయంలో రాబడి తగ్గడంతో చాలామంది రైతులు ప్రత్యామ్నాయంగా పశుపోణను ఎంచుకున్నారు. పశువులను పోషించడానికి కావాల్సిన ▶ 2లో

పోలింగ్ కేంద్రం బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బాపట్ల జిల్లాలో 85.15 శాతం పోలింగ్

- అద్దంకిలో అత్యధికంగా 88.25 శాతం
- రేపల్లెలో అత్యల్పంగా 82.59 శాతం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల జిల్లాలో 85.15 శాతం పోలింగ్ నమోదైంది. అన్ని నియోజకవర్గాల్లో 80 శాతం పైగా పోలింగ్ కావడం గమనార్హం. జిల్లాలో పురుష ఓటర్లు 6,29,794 మంది, మహిళా ఓటర్లు 6,61 ,841 మంది కలిపి మొత్తం 12,91,716 ఓటర్లు ఉన్నారు. అందులో 5,38,548 పురుష ఓటర్లు,5,61,358 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 38 మంది మొత్తంగా 10,99,944 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ఓట్లు 17,805 కి గాను 16,767 ఓట్లు పోల్ అయ్యాయి.బాపట్ల పార్లమెంట్ పరిధిలో సంతనూతలపాడుతో పాటు మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,06,354 ఓటర్లు ఉన్నారు.అందులో 12,87,704 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ఓట్లు 18,672 పోల్ అయ్యాయి. దీంతో మొత్తం 13,06,376s ఓట్లు పోల్ అయ్యాయి. బాపట్ల పార్లమెంట్ పరిధిలో 86.72 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. వేమూరు అసెంబ్లీ నియోజక వర్గంలో 1,70,666 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 86.43 శాతం పోలింగ్ నమోదయ్యింది. రేపల్లె నియోజక వర్గంలో 1,87,673 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 82.59 శాతం నమోదైంది.. బాపట్ల నియోజక వర్గంలో 1,58,500మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.02 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పర్చూరు ▶ 2లో

గ్రాసం లేక బక్కచిక్కిన ఆవులు

పోషణ భారమై.. కబేళాలకు పశువులు..

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సిన దాణా ప్రభుత్వం అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఇలా..

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశు పోషకులకు పాతర గడ్డి(సైలేజ్), దాణాతో పాటు పలు పథకాలు రాయితీపై అందించారు. ఏటా టన్నుల కొద్దీ పాతర గడ్డి బేళ్లను నేరుగా గ్రామాల్లోని పశు పోషకులకు అందజేశారు. 75 శాతం రాయితీపై పాతర గడ్డికిలో రూ.2 సరఫరా చేశారు. దాణా కూడా 75 శాతం రాయితీపై కిలో రూ.4 సరఫరా చేసేవారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద పశువుల సంరక్షణ షెడ్ల నిమిత్తం గోకులం, మినీ గోకులం నిర్మించారు. ఉపాధి హామీ నిధులతో ఊరూరా పశుగ్రాసం విస్తారంగా సాగు చేయించారు. అధిక సంఖ్యలో రైతులు వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న అన్నీ ప్రాంతాలకు పచ్చగడ్డి సరఫరా చేసి ఆదాయం పొందారు. వేసవి సీజన్లో పొలాలకు వెళ్లిన పశువులకు తాగునీటి సమస్య లేకుండా అందుబాటులో ఉన్న చేతిపంపుల వద్ద నీటి తొట్టెలు నిర్మించారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే గోకులం, మినీ గోకులం పథకాలను రద్దు చేసింది. వాటిని నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులు నిలిపేసింది. గత ప్రభుత్వ హయాంలో రాయితీపై దాణామృతం కిలో రూ.3 అందిస్తే వైసీపీ ప్రభుత్వం దాన్ని రూ.6.50 పైసలకు పెంచింది.

పశుగ్రాసం లేక బక్కచిక్కుతున్న గేదెలు

దుగ్గెంనేని శివయ్య, రైతు, వాదంపల్లి

రాయితీపై పాతర గడ్డి ఇవ్వని కారణంగా పల్లెల్లో పశు పోషకులు వరిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరిగడ్డి ట్రాక్టర్ ట్రక్కు ధర రూ.15 వేల వరకు పలుకుతోంది. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం పాల దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఐదేళ్లుగా పాతర గడ్డి పెంపకానికి ప్రోత్సాహం అందకపోవడం, రాయితీపై దాణా ఇవ్వకపోవడంతో పాడి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

పశు పోషణ భారమవుతోంది

వెంకటేశ్వర్లు నాయక్, రైతు, పిల్లికుంట తండా

పశుగ్రాసం ధర పెరిగింది. పోషణ భారం అవుతోంది. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నా. ఎనిమిది సంవత్సరాల నుంచి నాలుగు పాడి పశువులను పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. వీటి పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 వేలు అవుతుంది. పశుగ్రాసం ధర విపరీతంగా పెరగడం వల్ల పశుపోషణ భారం అయింది. వాటిని అమ్మడానికి నిర్ణయించుకున్నా.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరిగడ్డి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

85.15 శాతం పోలింగ్: కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతారణంలో జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్‌బాషా తెలిపారు. రీపోలింగ్‌కు అవకాశం లేకుండా అందరి సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ జయప్రదం చేసినట్లు తెలిపారు. ఎస్‌పి వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే గొప్ప సంకల్పంతో ప్రజలు ఓటు వేసినట్లు తెలిపారు. అందువల్లే పోలింగ్ శాతం పెరిగినట్లు తెలిపారు. చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్‌కు జిల్లాలో ఎలాంటి అవాంతరాలు జరగలేదన్నారు. ఎన్నికల నిర్వహణలో సమర్థంగా పనిచేసిన ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సహకరించిన ఉద్యోగులు, పోలీసులు, మీడియా సిబ్బందిని అభినందించారు. బాపట్ల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 10,99,944 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. 85.15 శాతం పోలింగ్ నమోదైందన్నారు. పోలింగ్ రోజున రాత్రి 6 గంటలు దాటిన తర్వాత కూడా 250 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు క్యూలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములకు తరలించిన ఇవిఎంలకు అభ్యర్థుల సమక్షంలో సీల్ వేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు అంచెల భద్రత: ఎస్‌పి

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు అంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాలకు పోలీసు అధికారులు వెంటనే చేరుకుని శాంతి భద్రతలను పరిరక్షించినట్లు తెలిపారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాటిలో 241 మంది నిందితులు ఉన్నట్లు తెలిపారు. త్వరితగతిన విచారణ జరిపి ఘర్షణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో శాంతిభద్రతలు విఘాతం కలిగించిన ఘటనలపై 43 కేసులు, ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై 19 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

యువకుడి హత్య

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ యువకుడిని కత్తితో పొడిచి పరారయ్యారని తెలిసింది. పట్టణ పోలీసులు రంగ ప్రవేశం చేసి నిందితులను పట్టుకునేందుకు సిసి పుటేజిని పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాపట్ల జిల్లాలో 85,15 శాతం ఓటింగ్

(మొదటిపేజీ తరువాయి)

పర్చూరు నియోజకవర్గంలో 2,00,264 మంది ఓటు హక్కును వినియోగించకున్నారు. 87.32 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. అద్దంకి నియోజకవర్గంలో 2,15,375 మంది ఓటు హక్కును వినియోగించకున్నారు. 88.25 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. చీరాల నియోజకవర్గంలో 1,67,466 మంది ఓటు హక్కును వినియోగించుకురన్నారు. 82.61 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ రోజున రాత్రి 6 గంటలు దాటిన తర్వాత 250 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు క్యూలో ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బాపట్ల జిల్లాలో పోలింగ్ నమోదు ఇలా...

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
వేమూరు	1,97,458	1,70,666	86.43
రేపల్లె	2,27,232	1,87,673	82.59
బాపట్ల	190,925	1,58,500	83.02
పర్చూరు	2,29,333	2,00,264	87.32
అద్దంకి	2,44,057	2,15,375	88.25
చీరాల	2,02,711	1,67,466	82.61

గ్రామాల్లో దాహం కేకలు

- పట్టించుకోని నేతలు..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎన్నికల్లో లబ్ధి చేకూరితే చాలు. జనం బాధలు మాకెందుకు అన్నట్లుంది అధికార పార్టీ నేతల తీరు. వేసవి రావడంతో చేతి పంపులన్నీ మొరాయించాయి. డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి. సాగర్ జలాలు అడుగు ముందుకు పడడం లేదు. జల జీవన్ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. పర్యవసానంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో నీటి కోసం కోటి కష్టాలు వచ్చాయి. నేతలు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ట్యాంకర్ల ద్వారా అందే నీటిని సర్దుకుంటూ కాలం గడుపుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పొలాల వెంట వెళ్లి బిందెలతో తెచ్చుకుంటున్నారు. ఎన్నికలు సమీపించడంతో ఓటుకు నోటు ఇచ్చే పనిలో హడావుడిగా ఉన్నారే తప్ప కనీసం ట్యాంకర్లతో నీళ్లు తోలడం లేదని ప్రజలు వాపోతున్నారు. తమ ఓట్లపై ఉన్న శ్రద్ధ తమపై లేదంటూ ఆరోపిస్తున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో కలిపి 94 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 130 గ్రామాలు దాకా ఉన్నాయి. ప్రతి యేటా వేసవి సమయంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రోజుకు సుమారు 900 ట్యాంకర్ల నీటిని ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేవారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేది నుంచి అధికారులు ట్యాంకర్లను నిలుపుదల చేశారు. దీంతో నీటి సమస్య తీవ్రమైంది.

పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న దృశ్యం

అడుగు ముందుకు పడని సాగర్ జలాలు..

ముటుకుల, దూపాడు, నడిగడ్డ, లక్ష్మిపురం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా సాగర్ జలాలను పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉన్నా నిత్యం మూడు లీకులు, ఆరు పగుళ్లతో పట్టుమని పది గ్రామాలకు కూడా సరఫరా కావడం లేదు. దీంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు కాంట్రాక్టర్లకు వరంగా మారాయే తప్ప ప్రజలకు గొంతు తడపడం లేదని వాపోతున్నారు.

తీవ్రంగా మారిన నీటి సమస్య..

నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో యర్రగొండపాలెం, వెంకటాద్రిపాలెం, బిళ్లగొందిపెంట, అయ్యంబొట్లపల్లి, మురారిపల్లి, తమ్మడపల్లి, గుర్రపుశాల, వాదంపల్లి, అమానుగుడిపాడు, పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల, పెద్దదోర్నాల, చిన్నదోర్నాల, కటకానివానిపల్లి, రామచంద్రకోట, బొమ్మలాపురం, బోడే నాయక్ తాండా. చిన్న గుడిపాడు, పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి, గొబ్బూరు, ఏనుగులదిన్నెపాడు, రాజంపల్లి, తోకపల్లి, దేవరాజుగట్టు, త్రిపురాంతకం మండలంలోని జి ఉమ్మడివరం, మేడపి, లేళ్లపల్లి, దువ్వలి, వెల్లంపల్లి, దూపాడు, పుల్లలచెరువు మండలంలోని మర్రివేముల, ముటుకుల, పుల్లలచెరువు, గంగవరం, వెంకటరెడ్డిపల్లి, రాచకొండ, మల్లాపాలెం, రంగన్నపాలెం, కుందంపల్లి, కొమరోలు తదితర గ్రామాల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పశు పోషకులు ఇంకా అవస్థలు పడుతున్నారు. ఓట్లపై ఉన్న శ్రద్ధ తమపై లేదంటూ ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వచ్చే వరకు మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఆరుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో టిడిపి మార్కాపురం పట్టణ అధ్యక్షుడు మౌలాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని దరిమడుగు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 544-డిపై బుధవారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి, ఆయన సతీమణి, కుమార్తె, మరొక మహిళ దోర్నాల మండలం బొమ్మలాపురం గ్రామంలో ఒక శుభకార్యానికి హాజరయ్యి తిరిగి మార్కాపురం పట్టణానికి పయనమయ్యారు. సరిగ్గా ప్రమాద స్థలి వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొని అటువైపుగా రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక ఇంజనీరింగ్ కళాశాల త్రిపుల్ ఈ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ మౌలాలి రోడ్డుపై నడిచి వెళ్తున్న ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నందకిషోర్, రామిరెడ్డిలకు బలమైన గాయాలయ్యాయి. కారులో వెనుక సీట్లో కూర్చొని ఉన్న డాక్టర్ మౌలాలి సతీమణి, ఆయన కుమార్తె, మరొక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన ప్రైవేటు వాహనాల్లో మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాల, కందుల ఓబుల్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం డాక్టర్ మౌలాలిని నరసరావుపేటకు తరలించారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉండడంతో పట్టణంలోనే వైద్యం అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వర నాయక్ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన వాహనం

తీవ్ర గాయాలపాలైన డాక్టర్ మౌలాలి

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న చంద్రశేఖర్

గాయపడిన కార్యకర్తకు తాటిపర్తి పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి గ్రామంలో మంగళవారం ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకునే విషయంలో టిడిపి, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చెలరేగి రాళ్లతో దాడి చేసుకున్న నేపథ్యంలో గాయపడి మార్కాపురంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్త కన్నెబోయిన సాయికృష్ణను బుధవారం వైసీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అండగా ఉంటాను, భయపడవద్దని తెలిపారు. మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట వైసీపీ యర్రగొండపాలెం మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలు

ఏరియా వైద్యశాలలో సౌకర్యాలు లేక..

రోగుల సతమతం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కనీస సౌకర్యాలు లేక రోగులు సతమతమవుతున్నారు. ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి 250 మంది దాకా రోగులు వస్తుంటారు. ఆరోగ్యం బాగా లేక చికిత్సలు పొందడానికి వెళ్లిన రోగులకు కనీసం కూర్చునే సదుపాయం కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పలు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వైద్యశాలలోని శుద్ధ జల పథకం కూడా పని చేయడం లేదు. దీంతో అటు కుర్చీలు లేక, తాగుందుకు నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్ల వ్యయంతో భవన సదుపాయం నిర్మించినా కనీసం రోగులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైద్యశాల అభివృద్ధి నిధులతోనైనా ఏరియా వైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

వైపాలెం మినీ గురుకులంలో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని మినీ గురుకులం (బాలికల ప్రాథమికోన్నత పాఠశాల) ఇంగ్లీష్ మీడియంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను ఐటిడిఎ పీవో డాక్టర్ బి రవీంద్రారెడ్డి ఆదేశాలతో దరఖాస్తులు కోరుతున్నట్లు మినీ గురుకులం ప్రధానోపాధ్యాయుడు వి బయన్న తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో ఎస్టీ చెంచులకు 20 ఖాళీలు, జనరల్ ఎస్టీలకు 10 ఖాళీలు చొప్పున మొత్తం 30, రెండో తరగతిలో ఎస్టీ చెంచులకు 10, జనరల్ ఎస్టీలకు 7 మొత్తం 17, మూడో తరగతి జనరల్ ఎస్టీలకు 5, ఐదో తరగతిలో జనరల్ ఎస్టీలకు 2, ఏడో తరగతిలో జనరల్ ఎస్టీలకు 3 చొప్పున మొత్తం 57 మంది విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని ఆదివాసి గిరిజన చెంచు బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి బాలికల తల్లిదండ్రులు మాత్రమే రావాలన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేది సాయంత్రం 5:30 గంటలు వరకు స్వీకరిస్తామని చెప్పారు. దరఖాస్తులకు బాలికల పాస్ ఫొటోలు 3, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు, పాఠశాల రికార్డు షీటు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, తల్లిదండ్రుల బ్యాంక్ పుస్తకం మొదటి పేజీ జత పరచాలన్నారు. వివరాలకు ప్రధానోపాధ్యాయుడు వి బయన్న సెల్ 9502723442 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి మార్కాపురం, వినుకొండ, మాచర్ల తదితర ప్రాంతాలకు సకాలంలో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయించి అధిక మొత్తంలో చార్జీలు చెల్లించి ప్రయాణిస్తున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కష్టాలు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కాపురం బస్సులు వస్తే వెంట వెంటనే వస్తున్నాయి. ఐదు నిమిషాల వ్యవధిలోనే తిరిగి వెళ్లిపోతున్నాయి. లేకుంటే గంటల తరబడి నిరీక్షించినా బస్సులు రాక అవస్థలు పడాల్సి వస్తోంది.

సమయపాలన ఏదీ..

పెద్దదోర్నాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు సమయపాలన పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ డ్రైవర్లు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తొమ్మిది గంటలకు దోర్నాల చేరాల్సిన బస్సులు 11 గంటలైనా చేరని పరిస్థితి ఉంది. ఇలా అన్ని డిపోల ఆర్డీనరీ బస్సులు నడుస్తున్నాయి. దీనికి తోడు బస్సులు వచ్చిన వెంటనే తిరిగి ప్రయాణికులు ఎక్కకముందే వాటిని కదిలిస్తుంటారు. ఇదేమని ప్రశిస్తే ఇప్పటికే రెండు గంటలు ఆలస్యమైందని ఎదురు సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయంపై మార్కాపురం డిపో మేనేజర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ప్రయాణికులు ఆరోపించారు.

దోర్నాల బస్టాండ్

బస్టాండ్‌లో నిలిచిన ఆటోలు

బస్సులను నడిపి ఆటోలను అరికట్టాలి..

పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు సకాలంలో బస్సులను నడిపి ప్రమాదాలకు గురయ్యే ఆటోలను ఆరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సుల ఆలస్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆటో డ్రైవర్లు వారి ఇష్టానుసారంగా డబ్బులు గుంజుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తహశీల్దారుకు గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదంలో యర్రగొండపాలెం తహశీల్దారు సోమ్లానాయక్ గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన సార్వత్రిక ఎన్నికల ఈవీఎం మిషన్‌లను ఒంగోలులో భద్రపరచి బుధవారం ఉదయం కారులో యర్రగొండపాలెం తహశీల్దారు సోమ్లా నాయక్, మండల సర్వేయర్ సైదారావు, సచివాలయ సర్వేయర్ దిలీప్‌లు యర్రగొండపాలేనికి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 10:30 గంటల సమయంలో పెద్దారవీడు మండలంలోని హనుమాన్ జంక్షన్ (కుంట) దగ్గర మలుపులో కారుకు లారీ తగిలి డివైడర్‌కు గుద్దుకుంది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న తహశీల్దారు సోమ్లా నాయక్ తలకు గాయమైంది. సచివాలయ సర్వేయర్ దిలీప్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 సహాయంతో మార్కాపురంలోని కందుల ఓబుల్‌రెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో రెవెన్యూ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతున్న తహశీల్దారు సోమ్లా నాయక్

నుజ్జునుజ్జయిన కారు

వరిగడ్డి వాములకు నిప్పు

ప్రజాశక్తి -శింగరాయకొండ

కుటుంబ కక్షల నేపథ్యంలో నిప్పు పెట్టి రెండు వరిగడ్డి వాములను దగ్ధం చేసిన సంఘటన శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి గ్రామ పంచాయతీలోని నర్రవారి పాలెంలో బుధవారం జరిగింది. కొల్లూరు వెంకటరావు అనే వ్యక్తి కుటుంబాలలో ఆస్తుల తగాదా ఉంది. దీంతో వీరి కుటుంబ సభ్యులైన కొల్లూరు చిన్న వెంకటేశ్వర్లు వాముకు వెంకట్రావు నిప్పు పెట్టడంతో వాములో ఉన్న 350 వరిగడ్డి మోపులు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు 70 వేల వరకు నష్టం జరిగిందని చెబుతున్నారు. ఆ పక్కనే ఉన్న నర్రా వెంకట శేషయ్యకు చెందిన వాము కూడా దగ్ధమైంది. దాదాపు 200 పైనే వరిగడ్డి మోపులు ఉంటాయని, సుమారు 30 వేల రూపాయల వరకు నష్టం ఉంటుందని చెబుతున్నారు. రెండు ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. వరిగడ్డి కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పోలీసులు కూడా ఘటన స్థలానికి చేరుకొని వరిగడ్డి వాము రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నారు.

తగలబడుతున్న వరిగడ్డి వాములు

ఆటో బోల్తా..

పదిమందికి గాయాలు

ప్రజాశక్తి-కర్లపాలెం: ఆటో బోల్తా పడి పది మంది గాయాలపాలైన సంఘటన మండలంలోని సత్యవతి పేట గ్రామం వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. నిజాంపట్నం ప్రాంతానికి చెందిన ఆటో ఓవర్ స్పీడ్‌తో కర్లపాలెం బాపట్ల హైవే రోడ్‌పై వస్తూ పక్కనే ఆగి ఉన్న బైకును ఢీకొని ఒక్కసారిగా బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో దాదాపు పదిమంది ప్రయాణికులు ఉన్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అందులో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని సమాచారం. ఆటో నిజాంపట్నంకు చెందినదిగా అక్కడ ఉన్నవారు తెలిపారు.

కలెక్టర్, ఎస్‌పిలను అభినందిస్తున్న సాయిబాబు

కలెక్టర్,ఎస్‌పికి అభినందనలు

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను మర్దవంతంగా, ప్రశాంతంగా నిష్పక్షపాతంగా నిర్వహించిన కలెక్టర్ రంజిత్ భాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు మాట్లాడుతూ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా, సకాలంలో అన్ని చర్యలు తీసుకొని సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారని అన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఇద్దరు అధికారులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. బాపట్ల ప్రజానీకం తరపున వారిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు జీవి, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - కర్లపాలెం

స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితిలో వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరావు సహకారంతో మండలంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం సన్మానం చేశారు. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన డోగుపర్తి తులసి అక్షయ, త్రివేణి అమృత (కర్లపాలెం పబ్లిక్ స్కూల్), పేరాల సాయి తేజశ్రీ (శ్రీ భార్గవి హైస్కూల్), షేక్ రిహాన్ (చింతాయపాలెం జడ్పి హైస్కూల్), షేక్ జాస్మిన్ (హై వెండ్ హైస్కూల్) విద్యార్థులను అభినందించారు. జ్ఞాపిక, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎ వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, జిడుగు వెంకటేశ్వర్లు, తుమ్మల శ్రీనివాసరావు, ఆలపాటి రమణారావు, తునుగుంట్ల వెంకట సుబ్బారావు, లలిత బాబు, కాటూరి బాజి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న బట్ట మోహనరావు

అనాధలకు అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రైల్వే స్టేషన్ ఆవరణలో అనాధలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు బట్ట మోహనరావు మాట్లాడారు. అన్నంతోనే మనిషి సంతృప్తి చెందుతాడని అన్నారు. అభాగ్యులు, నిరుపేదలు, అనాధలు ఆకలితో ఉన్నారని అన్నారు. వారికి సంతృప్తికరమైన భోజనాన్ని అందించడం రోటరీ లక్ష్యమని అన్నారు. రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎఈ యారాసు గణపతి మాట్లాడుతూ అనాధలకు అన్నదానం చేయటం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. భవిష్యత్తులో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. రోటరీ కార్యదర్శి ఎవి సురేష్ బాబు, సీనియర్ సభ్యులు ప్రత్తి వెంకట సుబ్బారావు, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటనపై ఏలూరి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్, చినగంజాం

స్వగ్రామంలో ఓటు వేయడానికి వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై మంటల్లో చిక్కుకొని ఆరుగురు మృత్యువాత పడటం తీరనివేదన మిగిల్చిందని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని పసుమర్తి, అన్నంబొట్లవారిపాలెం సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సును టిప్పర్ లారీ ఢీ కొన్న ప్రమాద వార్త తెలుసుకున్న ఆయన హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చొరవ చూపారు. క్షతగాత్రులు, వారి కుటుంబాలను బుధవారం అయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్ నుండి స్వగ్రామంలో బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకొని తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నగంజాం మండలం నీలాయపాలెం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి, చిన్నారి

మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న ఏలూరు సాంబశివరావు

ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ బస్సులో వెలువడిన మంటల్లో చిక్కుకొని మృతి చెందడం తతను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. రోడ్డు ప్రమాదం ఘటన పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఒకే మండలానికి చెందిన నలుగురు మృతి చెందడం, వాహన చోదకుల మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే వైసిపి అరాచకాలు

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలో ఓడిపోతామన్న భయంతో వైసిపి నాయకులు గ్రామాల్లో అల్లర్లకు తెగబడుతున్నారని టిడిపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. మండలంలోని పడమర పిన్నిబయిన వారిపాలెంలో మంగళవారం రాత్రి అల్లరి మూకలు తగులబెట్టిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు అనంతరం గ్రామ టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 92 శాతం పోలింగ్ నమోదు కావడంతో ఓడిపోతామనే భయంతో వైసిపి నాయకులు అల్లర్లకు పాల్పడుతున్నారని అన్నారు. గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి కార్యకర్త నర్రా ఏడుకొండలుపై వైసీపి గూండాలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చారని అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాల్లో చేరిన ఆయనను గుంటూరు ప్రయివేట్ ఆసుపత్రిలో తరలించి చికిత్స అందిస్తునారు. టీడీపీ

ఎన్టీఆర్ విగ్రహం వద్ద విలేఖలతో మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ తమ వాహనాలను తామె తగులబెట్టుకుని గ్రామంలో మహిళలు తగుల బెట్టారని ఆరోపిస్తూ అక్రమ కేసులు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. గ్రామంలో ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టిడిపి నాయకులతో గొట్టిపాటి సమావేశం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే బారీ స్థాయిలో పోలింగ్ జరిగిందని టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం గ్రామంలోని తన అతిథి గృహంలో వివిధ మండలాల శ్రేణులతో బుధవారం సమావేశమయ్యారు. ఎన్నికల సరళిపై చర్చించారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమి విజయం తధ్యమన్నారు. ఒక మంచికి, చెడుకి మధ్య జరిగిన ఎన్నికల్లో ప్రజలు మంచివైపు నిలబడి ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ధర్మం వైపు నిలబడి నందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నిర్విరామ కృషికి ఈ విజయం నిదర్శనంగా నిలవబోతుందని అన్నారు. అగ్నికి వాయువు తోడైనట్లు పవన్ కళ్యాణ్ సహకారం మరువలేనిదని అన్నారు. వీళ్ళ కలయికతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజాస్వామ్యం మనుగడకు ఈ ఎన్నికలు కొలమానంగా ఉంటున్నాయని అన్నారు. వైసీపీ సీనియర్ నాయకులకు డిపాజిట్లు, అడ్రస్ గల్లంతయ్యే పరిస్థితి రాబోతుందని

కార్యకర్తలతో మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

అన్నారు. ఎవరైతే బూతులు అరాచకానికి పాల్పడ్డారో వారంతా చిత్తుచిత్తుగా ఓడి ఇంటికి వెళ్లబోతున్నారని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బ్రతికించేందుకు తమఓటు హక్కు వినియోగించేందుకు ఇతర దేశాలు, రాష్ట్రాలు, జిల్లాల నుండి భారీగా ఎన్ని కష్టాలు ఎదురైనా తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఓటర్లు అందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిదే విజయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈనెల 13న జరిగిన ఎన్నికల ఫలితాల్లో వైసీపీకి విజయం లభిస్తుందని ఎంపీపీ డివి లలిత కుమారి ఆశాభావం వ్యక్తం చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేపదకాలు అమలు చేశారని అన్నారు. వాటిని తిరిగిపోదేందుకు ప్రతి ఒక్కరూ వైసీపీకి ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వైసిపి వైపు ఉన్నారని అన్నారు. టిడిపి,

మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

జనసేన కూటమి ఎన్ని అడ్డదారులు తొక్కి గెలవాలని ప్రయత్నించినప్పటికీ అంతిమ విజయం వైసిపిదేనని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా మరోసారి బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు గెలుపొందటం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

బాధితులను పరామర్శిస్తున్న గొట్టిపాటి రవికుమార్

క్షతగాత్రులకు గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - సంతమాగులూరు

పోలీసుల భద్రత వైఫల్యంతోనే వైసిపి దాడులకు బరితెగించిందని టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మిన్నేకల్లు గ్రామంలో ఎన్నికల సందర్భంగా ఎస్సీ కాలనీలో వైసిపి అల్లరి మూకల దాడిలో గాయపడి నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి నాయకులు కంభంపాటి పెదరామయ్య, కంకి సలోమాన్, కంకి మాణిక్యరావు, కంకి పూర్ణయ్య, జిర్రా విజయ్ భాస్కర్, జిర్రా భాగ్యరాజ్, జిర్రా రాజేష్‌లను ఆయన బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య విషయంపై వాకబ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసిపి అల్లరి మూకలు దాడులు చేశారని అన్నారు. టిడిపి కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసీపీ దాడులకు పాల్పడి వారి ఓటమిని వారు ముందే అంగీకరించారని అన్నారు. కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అట్లా చిన్న వెంకటరెడ్డి, వసంత వేణు, ముప్పాళ్ళ శ్రీను పాల్గొన్నారు.

సమావేశంలో టిడిపి అభ్యర్థి ఎంఎం కొండయ్య

అన్నిటికీ తట్టుకొని నిలబడ్డాం

టిడిపి అభ్యర్థి కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గ ప్రజలు అన్ని విధాలా సహకరించారని, అన్నింటినీ ఎదుర్కొన్ని ఎన్నికల్లో నిలిచినట్లు టిడిపి అభ్యర్థి ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అనునిత్యం తమను వెన్నుతట్టి ప్రోత్సహించారని అన్నారు. చెదురు ముదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. తను గెలుపొందిన తరువాత అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాచిన చెంచు గరటయ్యతో కలిసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల పార్లమెంటు నియోజక వర్గంలోని ఏడు అసెంబ్లీల్లో టిడిపి జెండా ఎగురవేస్తామని డాక్టర్ బాచిన చెంచు గరటయ్య అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పాలన జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేశారని అన్నారు. నియోజక వర్గంలో నాయకులు, కార్యకర్తలు అందరి సహకారంతో విజయ వంతంగా ఎన్నికలను ఎదుర్కొన్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు అన్నారు. కార్యకర్తల సమిష్టి కృషితో గెలవబోతున్నట్లు ఎన్నికల పరిశీలకులు వీరయ్యచౌదరి అన్నారు. చంద్రబాబు ప్రకటించిన పధకాలు ఆకర్షించాయని అన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, కవుతరపు జనార్ధన్, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి జి చంద్రమౌళి, బొగ్గుల పార్థసారథి, నాశిక వీరభద్రయ్య, గంజి పురుషోత్తం, కౌన్సిలర్ సురగాని లక్ష్మి, ఉల్లిపాయల సుబ్బారావు, కూరపాటి పూర్ణ, రమేష్, షేక్ యాసిన్, సయ్యద్ బాబు, బిజెపి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే..

- సానుభూతి ఆశలో టిడిపి
- మంచిని చూశారని వైసిపి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 87.58 శాతం ఓటింగ్ జరిగింది. గత ఎన్నికల కంటే 7 శాతం అధికంగా ఓట్లు ఈ ఎన్నికల్లో పోల్ కావడం విశేషం. ప్రస్తుత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు రాత్రివేళ కూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. పోలింగ్ సరళిపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు విజయం మాదంటే... మాదని ధీమాగా ఉన్నారు.

మార్కాపురం నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి ఇక్కడ ఆదరణ ఉంది. వైసిపి ఆవిర్భవించిన తరువాత 2014లో జంకె వెంకటరెడ్డి, 2019లో కుందురు నాగార్జునరెడ్డిలు భారీ మెజార్టీలతో వైసిపి తరపున గెలుపొందారు. టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీ చేసి పలుమార్లు ఓడిపోయారు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తరచూ ఓడిపోవడం..

అన్నా వెంకట రాంబాబు, కందుల నారాయణరెడ్డి

ప్రమాదానికి గురికావడం వంటి అంశాలు తమకు అనుకూలమని టిడిపి నేతలు భావిస్తున్నారు. కందుల నారాయణరెడ్డి పదేపదే ఓడిపోయారని, ఈసారి కందులపై ప్రజల్లో సానుభూతి ఉందని టిడిపి చెబుతోంది. ఓటింగ్ సరళి పెరిగింది కూడా అందుకేనని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఖచ్చితంగా కందుల గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలతో పాటు అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ధీమాగా ఉన్నారని తెలిసింది.

వైసిపి తరపున గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మార్కాపురం నుంచి పోటీ చేశారు. ఇక్కడ 50 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. రాజకీయాల్లోకి రాక ముందు నుంచీ సామాజిక సేవతో పేరు గడించారు. తాగునీటి సరఫరా, పేద విద్యార్థులకు చదువుల్లో సాయం అందించడం, పేదల ఇళ్లలో జరిగే శుభ కార్యాల్లోనూ ఎంతో కొంత అన్నా రాంబాబు సాయం ఉంటోంది. సేవా కార్యక్రమాలతో పార్టీలకు అతీతంగా అన్నా మిత్ర మండలి ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో అన్నా మిత్రమండలిలో సభ్యులంతా వైసిపి విజయం కోసం పనిచేశారు. అన్నా రాంబాబు మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో రాంబాబుకు సాయం చేయడంలో మిన్న అనే పేరు ఉంది. ఓటింగ్ సరళి పెరిగిందంటే 'అన్నా' మంచితనం అందుకు నిదర్శనమని వైసిపి నేతలు చెబుతున్నారు. వీటన్నింటికీ తోడు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష లేని సంక్షేమం ఒక కారణమని చెబుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో ఈసారి కూడా వైసిపి జెండా ఎగురవేస్తామని, భారీ మెజార్టీ వస్తుందని అన్నా వెంకట రాంబాబు ధీమాగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు బారులు తీరి ఓటేయడంతో ఓటింగ్ శాతం పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్‌తో విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

85 శాతం పోలింగ్ రికార్డు

- కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

85 శాతం పోలింగ్ జరగడం కనిగిరి నియోజకవర్గ చరిత్రలో రికార్డు అని కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. పోలింగ్ ప్రక్రియపై కనిగిరి పట్టణ టిడిపి బూత్ ఇన్‌ఛార్జులు, టిడిపి శ్రేణులతో వార్డుల వారీగా సమీక్ష సమావేశాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో వైసిపి కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, టిడిపి శ్రేణులు సంయమనం పాటించాలని కోరారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కనిగిరి నియోజకవర్గానికి చెందిన 44 వేల మంది ఓటర్లు కనిగిరికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. జూన్ 4న కనిగిరి కొండపై టిడిపి జెండా రెపరెపలాడటం ఖాయమని అన్నారు. ఈ ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. నియోజక వర్గ టిడిపి శ్రేణుల నుంచి ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై సేకరించిన సమాచారాన్ని రాష్ట్ర నాయకత్వానికి అందజేస్తామని వెల్లడించారు. చంద్రబాబు నాయుడు 145 స్థానాలతో ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయ మన్నారు. ఆయన కనిగిరికి ఇచ్చిన ఐదు హామీలను నెరవేర్చుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెండో రోజు కూడా డాక్టర్ ఉగ్రను కలిసి అభినందించేందుకు కనిగిరి

మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా వచ్చిన టిడిపి శ్రేణులతో అమరావతి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

ముగిసిన 4 రౌండ్ల కొనుగోళ్లు

- సరాసరి ధర కిలో రూ.237.36
- ఆశాజనకంగా ఉన్న రేట్లు
- 5.11 మిలియన్ల పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నాటితో 4 రౌండ్ల పొగాకు కొనుగోళ్లు ముగిశాయని గురువారం నుంచి 5వ రౌండ్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. నాలుగో రౌండ్ పూర్తి అయ్యేనాటికి 5.11 మిలియన్ల పొగాకు అమ్మగా అందులో అత్యధిక ధర కిలో రూ.300, అత్యల్ప ధర కిలో రూ.205, సరాసరి ధర కిలో రూ.237.36 పలికింది. అలాగే 4వ రౌండ్ పూర్తి అయ్యేనాటికి బ్రైట్‌రకం సరాసరి ధర కిలో రూ.248.99, మీడియం రకం పొగాకు సరాసరి ధర కిలో రూ.254.50, లోగ్రేడు పొగాకు సరాసరి ధర కిలో రూ.230.76 పలికిందన్నారు. మొత్తం మీద బ్రైట్ గ్రేడ్ భాగము 15శాతం, మీడియం గ్రేడు భాగము 16శాతం, తక్కువ గ్రేడ్ భాగము 69 శాతం అమ్మకాలు జరిగాయి. ఇప్పటి వరకు రైతుల ఖాతాలలో రూ.121,30,75,613.90 జమ చేసినట్లు తెలిపారు. ఐదవ రౌండ్‌లో ఫుల్ బ్యారన్‌కు 4 బేళ్లు వంతున ఇస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి తెలిపారు. సాఫ్ట్ హీటడ్ బేల్స్ లేకుండా చూసుకోవాలని, 150 కేజీలు కంటే ఎక్కువ లేకుండా చెక్ చేసుకోవాలని తెలిపారు.

ఆశాజనంగా ధరలు..

ఆనందంలో రైతులు

కొండపి పొగాకు వేలం కేంద్రంలో మొదటి రెండు రౌండ్లలో ధరలు నిరాశ పరిచాయి. బ్రైట్ రకం బేళ్లు అనుకున్నంత గిట్టుబాటు ధర లభించలేదని రైతులు తెలిపారు. కాని మూడో రౌండ్‌లో సగం నుంచి మొదలై నాలుగో రౌండ్‌లో రోజురోజుకూ బ్రైట్ రకం పొగాకు ధరలు పెరుగుతూ వచ్చాయి. బుధవారం నాటికి గరిష్ట ధర కిలో రూ.300 పలికింది. మీడియం, లోగ్రేడు పొగాకు ఒక రకమైన గిట్టుబాటు ధర లభిస్తున్నాయని, లోగ్రేడు పొగాకు అమ్మకాల వలన ఎటువంటి ఇబ్బందులు లేవని రైతులు ఆనందంగా తెలిపారు. నెంబర్ పొగాకుకు ఇదే ధర లభిస్తే రైతు వద్ద ఉన్న 40 శాతం నెంబర్ పొగాకుకు మంచి ధరలు వచ్చినట్లేనని రైతులు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మిగతా బోర్డు కంటే కొండపి బోర్డు బ్రైట్ రకం పొగాకు ధరలు పెంచింది. ఇదే విధంగా ధరలు మిగిలిన అన్ని రౌండ్లలో పలికితే పెరిగిన ధరలకు అనుగుణంగా అన్ని ఖర్చులు పోను రైతులకు లాభాలు

పొగాకు వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్

చేకూరుతాయని రైతులు తెలిపారు.

బుధవారం వేలం వివరాలు

బుధవారం కొండపి వేలం కేంద్రానికి చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 826 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 781 బేళ్లను కొనుగోలు చేయగా మిగిలిన 45 బేళ్ల వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.300, అత్యల్ప ధర కిలో రూ.205 సరాసరి ధర కిలో రూ.264.01 పలికిందని తెలిపారు.

మోకాలి శస్త్ర చికిత్స కోసం..

హైదరాబాద్ వెళ్లిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-కొండపి

మోకాలి శస్త్ర చికిత్స కోసం రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి, కొండపి వైసిపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హైదరాబాదుకు వెళ్లారు. గతంలో ఆయనకు ఎడమ కాలు ఆపరేషన్ జరిగింది. కాగా గత సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన కొండపి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. అయితే కుడి కాలు కూడా నొప్పితో ఆయనను ఇబ్బంది పెట్టినా నొప్పి భరిస్తూనే ఎన్నికల ప్రచారం, పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కుడి కాలు మోకాలి శస్త్ర చికిత్స చేయాలని చెప్పటంతో శింగరాయకొండ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ కారణంగా నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండలేకపోతున్నానని, ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని మంత్రి సురేష్ కోరారు.

సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు: చైర్మన్

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. బుధవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణంలోని 9వ వార్డు కొలిమి బజారులోని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నీటి సమస్య, పారిశుధ్య సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు రెహమాన్, పండు, మన్సూర్, నాగూర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో పురుషులకు ఉచిత శిక్షణ ఈ నెల 22 నుంచి ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 9 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలని, శిక్షణ కాలంలో శిక్షణతో పాటు వసతి భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు, పేర్ల నమోదుకు 9492583484 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న దద్దాల

కార్యకర్తలకు దద్దాల పరామర్శ

ప్రజాశక్తి-పామూరు

ఎన్నికల సమయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వైసిపి కార్యకర్తలను కనిగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. కంబాలదిన్నె పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో గాయపడిన వారిని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ, టిడిపి నాయకుల దౌర్జన్యాలకు ఎవరూ భయపడవద్దని, వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గాయపడిన కార్యకర్తలను పరామర్శించారు. ఆయన వెంట కే రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి పువ్వాడి రాంబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఇద్దరు నిందితులు అరెస్టు
మరో ముగ్గురి కోసం గాలింపు

ప్రజాశక్తి - బాపట్ల

పొగ బారిన ఎన్టీఆర్ విగ్రహం

ఎన్నికల సందర్భంగా మండలంలోని పడమర పిన్నిబోయిన వారి పాలెం లోని ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పంటించిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ శ్రీహరి విలేకరులకు బుధవారం తెలిపారు. ఎలక్షన్ కమిషన్ నిభందనల ప్రకారం ఎన్టీఆర్ బొమ్మకు చుట్టిన ఫ్లెక్సికి నిప్పంటించిన అదే గ్రామానికి చెందిన పిన్నిబోయిన అంజనికుమార్ ఎలియాస్ అంజి, మద్దిబోయిన హనుమంతరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవల్లో ఎన్టీఆర్ బొమ్మకు నిప్పంటించారని తెలిపారు. అక్కడే పికెట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు చూసి వెంటనే మంటలు ఆర్పేశారని తెలిపారు. విగ్రహానికి ముందు, వైపున కొంతభాగం నల్లని మసి బారినట్లు తెలిపారు. విగ్రహానికి ఏ విధమైన నష్టం వాటిల్ల లేదన్నారు. సంఘటనలో పిన్నిబోయిన అంజనికుమార్, మద్దిబోయిన హనుమంత రావు, మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని అన్నారు. కేసులో నిందితులైన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో మరింత సమాచారం తెలిసే అవకాశం ఉందని తెలిపారు.

మాట్లాడుతున్న దామచర్ల సత్య

ఎన్నికల్లో టిడిపిదే విజయం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దామచర్ల సత్య

ప్రజాశక్తి - శింగరాయకొండ

కొండేపి నియోజకవర్గంలో టిడిపి విజయం సాధించబోతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మండలంలోని మూలగుంటపాడులోని కాకతీయ కన్వెన్షన్ హాల్లో మూలగుంటపాడు టిడిపి నాయకులతో బుధవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా టిడిపి నుంచి పోటీ చేసిన డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మూడోసారి విజయం సాధించబోతున్నారని అన్నారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ టిడిపి గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, చిగురుపాటి శేషగిరి, నేలపాటి బాల శంకర్ బాబు ఉన్నారు.

16 నుంచి కికెట్ పోటీలు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

ఈనెల 16 నుండి మండలంలోని ఉప్పుగుండూరులో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడా ప్రాంగణంలో ఉప్పుగుండూరు విద్యానగర్ జెవైఎస్ రాజేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40.116, రెండవ బహుమతి రూ.30,116, మూడవ బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.10,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బహుమతులు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు జి అశోక్ 8886933272, ఎ వినోద్ 9553677108, జి శ్రీకాంత్ 9542550428 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిర్లక్ష్యానికి గురైన భవనాసి జలాశయం

- ప్రాజెక్టు పూర్తయితే 9494 ఎకరాలకు సాగు
- గోకనకొండ వద్ద గుండ్లకమ్మ నదిపై నిర్మించిన ఆనకట్ట
- గోకనకొండ నుండి చెరువుకు కాలువ నిర్మాణం
- కొంతమేర పనులు నిలిచిపోయిన వైనం
- ప్రభుత్వ నిధులు కేటాయించక నిలిచిన పనులు

ప్రజాశక్తి - అద్దంకి

గుండ్లకమ్మపై పల్నాడు జిల్లా గోపనకొండ వద్ద నిర్మాణం చేపట్టిన చెక్ డాం పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడంతో అర్ధరాంతంగా పనులు నిలిచిపోయాయి. 2008లో భవనాసి మినీ రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.28కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి సిఎం డాక్టర్ వైఎస్ఆర్ జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా గోకనకొండ వద్ద గుండ్లకమ్మ నదికి ఆనకట్ట నిర్మించి కాలువల నిర్మాణం చేపట్టడం ద్వారా 13కిలో మీటర్ల దూరంలోని వెంపరాల చెరువు, భవనాసి చెరువులకు నీరు అందిస్తూ ఆయకట్ట భూములకు సాగునీరు అందించాలనేది ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టు పనులు 2009 జూన్‌లో ప్రారంభించారు. కొంతమేర శరవేగంతో నిర్మాణాలు చేసినప్పటికీ రెండు పర్యాయాలు గుండ్లకమ్మ నదిపై వరదలు రావడం, నిధులు తక్కువగా ఉండడంతో పనులు మందకొడిగా సాగాయి. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

సాగు ఆయకట్టు వివరాలు

జలాశయం ఆయకట్టులోని కాలువల ద్వారా 1797ఎకరాలు, రెండు పర్యాయాలు సాగుకు రావడం ద్వారా 3494 ఎకరాలు, సింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా 5800 ఎకరాలు, వెంపరాల చెరువు ఆయకట్టు కింద 200 ఎకరాలు కలిపి 9494 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.

గోకొనుకొండ వద్ద చెక్‌డాం నిర్మాణం

గోకొనకొండ వద్ద గుండ్లకమ్మ నదిపై అడ్డుగా ఆనకట్ట నిర్మించారు. ఉత్తరం వైపు మూడు కానాలు నిర్మించారు.

అభివృద్ధికి నోచని భవనాశి చెరువు

వాటికి తలుపులు బిగించడం ద్వారా కాలువల్లో నీటిపారుదల నిర్వహణ జరపాల్సి ఉంటుంది. కాలువ నిర్మాణానికి అవసరమైన 192ఎకరాలు రైతుల నుంచి సేకరించి పరిహారం అందించారు. చక్రాయపాలెం సమీపంలో కొంత భూమికి మాత్రం నష్టపరిహారం అందించాల్సి ఉందని, ఇప్పటికే భవనాసి కట్టను బలంగా నిర్మాణాలు చేశారు. అలుగు నిర్మాణం కొంతమేర చేపట్టాల్సి ఉంది. భవనాసిని పెంచాల్సిన క్రమంలో మరో 270 ఎకరాలు వరకు భూసేకరణ జరపాల్సి ఉంది. ఇందులో 52 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండడం ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశం. మైలవరం, ఉప్పలపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులకు సంబంధించి ఏడు ఎకరాల భూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది.

కాలువ నిర్మాణానికి ఆటంకాలు

గోకనకొండ వద్ద నుండి భవనాసి వరకు నిర్మాణంలో ఉన్న కాలువ భూమికి ఇప్పటికే రైతులకు నష్టపరిహారం చెల్లించారు. కాలువ తీస్తున్న సమయంలో లోపల పెద్ద బండ రాళ్లు బయటికి వచ్చాయి. వీటిని పగలగొట్టేందుకు, కాలువల పరిధిలో ఉన్న విద్యుత్ శాఖ స్తంభాలు తొలగించేందుకు ప్రభుత్వం అనుమతి రావాల్సి ఉంది. భవనాసి చెరువులో భూసేకరణకు సంబంధించి మరో 220 ఎకరాలకు ఇచ్చే పరిహారం గురించి రైతులతో మాట్లాడాల్సిన అవసరం ఉంది. రైతులు ఒప్పు కుంటేనే భవనాసి జలాశయం పూర్తిస్థాయిలో నీరు నింపుకునేందుకు అవకాశం ఉంది.

గతంలో రూ.18కోట్లు నిధులు విడుదల

భవనాసి జలాశయం మినీ రిజర్వాయర్ నిర్మాణానికి మొదట విడతగా రూ.27కోట్లు, కొంతకాలానికి రూ.18 కోట్లు కలిపి రూ.45కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధుల్లో భూసేకరణకు రూ.12కోట్లు, ఆనకట్ట బలోపేతానికి రూ.7కోట్లు, భవనాసి చెరువు కట్ట బలోపేతం చేయడానికి రూ.1.60కోట్లు, కాలువ నిర్మాణానికి రూ.6.20 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా ఈ సారీ రూ.18కోట్ల ప్రభుత్వం విడుదల చేసిన నగదు మాత్రం ప్రభుత్వ ఖజానాలోని ఉన్నట్లుగా సమాచారం.

కొత్త ప్రభుత్వమైన జలాశయంపై దృష్టి సారించేనా?

భవనాసి జలాశయం నిర్మాణం పూర్తయ్యేందుకు అనేక పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాలువులకు తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలువలో ఉన్న బండ రాళ్ళు పగలగొట్టేందుకు అనుమతులు, అలుగు ఎత్తు పెంచడం వంటివి తక్షణం చేయదగిన పనులు ఉన్నాయని, మరింత కీలకమైన భూసేకరణకు ప్రభుత్వం ముందుకు వచ్చి అదనపు నిధులు మంజూరు చేయించగలిగితే అద్దంకి ప్రాంతంలో దాదాపు 9494 ఎకరాల భూమికి సాగునీరు అందించే వీలుంటుందని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే సాధ్యమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ప్రజాశక్తికి వెల్లడించారు. రిజర్వాయర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని గతంలో తాము అనేక పోరాటాలు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. భవనాసి జలాశయం అందుబాటులోకి వస్తే పట్టణానికి తాగునీరు, రైతాంగానికి సాగునీరు అందుతుంది. జలాశయంలో మధ్యలో స్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు గతంలో ప్రణాళిక రూపకల్పన చేశారు. క్షేత్రస్థాయిలో అది ఇప్పటివరకు సాధ్యం కాలేదు. రానున్న ప్రభుత్వం భవనాసి జలాశయం పనులు త్వరితగతిన పూర్తి చేస్తే మండల ప్రజానీకానికి ఎంతో మేలు జరుగుతుంది.

ప్రజల దాహార్తిని తీరుస్తున్న ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - పంగులూరు

వాళ్లంతా ఆటో డ్రైవర్లు. రోజువారీ కష్టంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సామాన్యులు. తమను గురించి ఎవరూ పట్టించుకోకపోయినా తాము ప్రజలను గురించి పట్టించుకోవాలని నిర్ణయించుకున్నారు. వేసవి కాలంలో ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు పోయాలని నిర్ణయించుకున్నారు. చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేలాది మందికి తాగునీరు అందిస్తున్నారు. మండలంలోని ముప్పవరంలోని ఉమేష్ చంద్ర ఆటో యూనియన్‌లో సుమారు 40 మంది సభ్యులు ఉన్నారు. వీళ్లలో ఎక్కువ మంది ఎస్సీ, బీసీ ఎస్టీ మైనార్టీలే. రోజు ఆటో కదిలితేనే వాళ్ళ కడుపులోకి గుప్పెడు అన్నం వెళ్ళేది. పైగా ఆటోలను ఫైనాన్స్ కంపెనీల దగ్గర తెచ్చుకుని నెలవారి ఆటో కిస్తీలు కట్టుకుంటూ కుటుంబాలను పోషించుకునే పరిస్థితి వీరిది. అయితేనేమి వీరు తమ గురించే కాకుండా సమాజం గురించి కూడా ఆలోచించారు. ప్రజలకు తమ యూనియన్ ద్వారా ఎంతో కొంత సేవ చేయాలనుకున్నారు. ఆ నిర్ణయమే వారిని గత రెండేళ్లుగా చలివేంద్రం నిర్వహించి ప్రతిరోజు వేలమందికి తాగునీరు అందించే పని చేస్తుంది. ముప్పవరం సెంటర్లో ఫ్లైఓవర్ పక్కనే తాటాకులతో పందిరి వేసి అందులో చలివేంద్రం నడుపుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలు చలివేంద్రాన్ని నిర్వహిస్తామని ఉమేష్ చంద్ర ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శివ, సంపంగల దానియేలు తెలిపారు. తమ యూనియన్ సభ్యులంతా చందాలు వేసుకొని చలివేంద్రాన్ని నడపడమే కాకుండా ప్రతిరోజు

ప్రయాణికులకు నీళ్లు అందిస్తున్న చలివేంద్రం సభ్యులు

కొంతమంది చలివేంద్రం నిర్వహణలో భాగస్వాములు అవుతున్నామని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రజలే కాకుండా లారీలు, ఆర్టీసీ బస్సులు, కారుల్లో ప్రయాణించే ప్రయాణికులకు కూడా బాటిళ్లలో మంచినీరు అందిస్తున్నారు. దూర ప్రయాణాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. చలివేంద్రంలో రెండు వాటర్ కూలింగ్ మిషన్‌లు పెట్టి వాటి ద్వారా చల్లటి మంచినీళ్లు అందిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు 1600 లీటర్ల (80 బబుల్స్) మంచినీళ్లను ప్రయాణికులకు అందిస్తున్నామని చెప్పారు. ఆటో యూనియన్ సభ్యుల సహకారంతో పాటు దాతల సహకారం తమకు సంపూర్ణంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా చలివేంద్రాన్ని వేసవి కాలంలో కొనసాగిస్తామని తెలిపారు. రోజువారి పని చేసుకునే ఆటో డ్రైవర్లు చలివేంద్రం నిర్వహించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

స్టేషన్ వద్ద ఉన్న కుక్కలు

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి - వేమూరు

ఊరు, వాడ లేకుండా ఎక్కడపడితే అక్కడ కుక్కలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి. జంతు సంరక్షణ శాఖ కుక్కల నిషేధంపై నిషేధాన్ని ఎత్తివేయడంతో కుక్కల సంతతి పెరిగిపోయాయి. రహదారుల వెంట వాహనాలు తిరుగుతుండగా వాటి వెంటపడే కుక్కలు కొన్ని ఉండగా మరికొన్ని నడిచి వెళ్లే వారిని పైన పడి కడుస్తున్న సంఘటనలు ఉన్నాయి. స్థానిక రైల్వే స్టేషన్లో పట్టపగలు సుమారు 10కి పైగా కుక్కలు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. రైలు వచ్చే సమయంలో స్టేషన్లో ప్రయాణికుల రద్దీ విరివిగా ఉంటుంది. ఆ సమయంలో కుక్కలు ప్రయాణికుల మధ్యగా ఖర్చుకుంటూ ఒకదానిపై ఒకటి పడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. కుక్కలు కరుసుకునే సమయంలో ప్రయాణికులు పైబడి ఎక్కడ కరుస్తాయని భయంపడుతున్నారు. గతంలో కుక్కలను పట్టించడానికి గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకపోవడంతో ఎక్కడెక్కడ కుక్కలన్నీ స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలు తిరగటానికి భయాందోళనకు గురికావల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో కుక్కలు నిత్యం ప్రజలను కరుస్తూ వైద్యశాలల చికిత్సలు పొందుతున్న ఘటన కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి విచ్చలవిడిగా పెరిగిపోతున్న కుక్కలను అదుపు చేసే చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చీరాల

గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంధ పాలకురాలు ధనమ్మ అన్నారు. వేసవి కాలంలో విద్యార్థులకు ఈ నెల 15 నుండి జూన్ నెల 7వరకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు

శిక్షణ తరగతుల్లో గ్రంథ పాలకురాలు ధనమ్మ

తెలిపారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగా ఎక్కువ మంది హాజరై వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. గ్రంథాలయంలో కొత్తగా వచ్చిన పుస్తక సంపదను ఉపయోగించుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాల అమలులో లోపం

- కనీస వేతనానికి నోచని బీడీ కార్మికులు
- రోజంతా పనిచేసినా పూట గడవక అవస్థలు

ప్రజాశక్తి - వేటపాలెం

బీడీ కార్మికుల జీవితాలు రోజు రోజకు దుర్భరంగా మారుతున్నాయి. వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల అమలులో చిత్తశుద్ధి లేదు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నిర్ణయంతో బీడి పరిశ్రమ ఉనికికే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో రెండు వేల మంది కార్మికులు బీడీ చుట్టే పనిలో ఉన్నారు. మరో రెండు వేల మంది కార్మికులు ఆకుసేకరణ, ప్యాకింగ్, స్టిక్కరింగ్, తండూరి, రవాణా పనులు చేన్నారు. పేదోడి సిగరేట్‌గా పేరొందిన బీడిల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది. ఇదంతా ఒక్క ఎత్తు. కార్మికుల గురించి పట్టించుకొనే నాధుడే కనిపించడం లేదు. వారికి మాత్రం జబ్బులు తప్ప మరి ఏమీ మిగలడం లేదు. క్షయ, క్యాన్సర్, గర్భకోశ, శ్వాశకోస, ఆస్తమా, జలుబు, దగ్గు, గ్యాస్ట్రబుల్, నిస్సత్తువ, రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. బీడీ పని అంటేనే రోజుకు కొంత ఆరోగ్యాన్ని కుళ్ళబొడుచుకోవటమే. వీరికి ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకూ బీడిలు చుట్టడంతప్ప మరే వ్యాపకం ఉండదు. రోజుకు 16గంటల శ్రమిస్తే తప్ప పూట గడవదు.

చెట్ల మధ్యలో బిడి కార్మికుల వైద్యశాల బోర్డు

పరోక్షంగా పనిచేసేవారికంటే ఇళ్ళల్లో బీడిలు చుట్టే వారే ఎక్కువ. వీరు నివశించే ఇళ్లలో కనీసం గాలి, వెలుతురు కూడా సక్రమంగా ఉండదు. మహిళలకు చిన్నపిల్లలు సహాయ పడుతుంటారు. ఇంత చేసినా రోజుకు వారి సంపాదన రూ.150 మించదు. కనీస వేతనం గురించి వారికి అసలే తెలియదు. జిల్లాలోని వేటపాలెం, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు, చీరాల, పేరాల ప్రాంతాల్లో బీడి కార్మికులు అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్నారు. ప్రభుత్వాలు వీరి కనీస వేతనాల గురించి ఊసేత్తవు. వీరందరూ రోజువారి కూలీలుగానే మిగిలిపోతున్నారు. దీంతో వీరికి పిఎఫ్, ఇఎస్ఐ, వంటి సౌకర్యాలు ఉండవు. జిల్లాలో బీడీ కార్మిలకు వైద్యం, సంక్షేమ పథకాలు అందించే నిమిత్తం 2012లో వేటపాలెం మండలంలోని హిమాం నగర్ ప్రాంతంలో భారత ప్రభుత్వం బీడికార్మికుల సంక్షేమ నిధి, వైద్యశాలను నెలకొల్పంది. ఇందులో మెడికల్ ఆఫీసర్, పార్మసిస్ట్, ఇద్దరు మల్టీ టాస్కింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ఈ వైద్యశాల్లో కేవలం 715మంది బీడి కార్మికులు మత్రమే గుర్తింపు కార్డులు జారీచేశారు. వీరందరికి 12రకాల కేంద్ర సంక్షేమ పథకాలు అందు బాటులో ఉండేవి. క్షయవ్యాది రోగులకు ఏడాదికి రూ.20వేలతో వైద్య సదుపాయం అందిస్తారు. క్యాన్సర్ రోగులకు చికిత్సతో పాటు రాను, పోను రవాణా ఖర్చులు ఇచ్చేవారు. మానసిక రోగులకు ఏడాది వైద్యం, రూ. 900లు ఇచ్చేవారు. కుష్టువ్యాధి, కంటి సమస్యలు, మహిళలకు రెండు కాన్పులకు ఖర్చు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్, గుండె జబ్బులకు, మూత్రపిండాల వ్యాధికి రూ.2లక్షలకు మించకుండా ఖర్చు చేస్తారు. బిడి కార్మికుల సంక్షేమం, కనీస వేతనం అమలు చేయాలని కోరుతున్నారు.

రోడ్లపై గుంతలు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత ఐదేళ్ళుగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదు. గతుకుల రహదారుల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఐదేళ్ల క్రితం వేసిన రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంటలు పడి వాహన చోదకులకు ప్రాణ సంఘకటకంగా మారింది. వీటి కంటే ప్రధానమైన గ్రామాలను కలిపే రహదారులు సైతం ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఆ రహదారులు ప్రజల రాకపోకలకు తీవ్ర భయాందోళన కలిగిస్తున్నాయి.

వెంకటరాజు నగర్, పేటేరు రహదారి

అలాంటి వాటిలో పోలేరు గ్రామ పంచాయతీలోని వెంకటరాజు నగర్ నుండి పెట్టేరు వెళ్లే రహదారినీ అభివృద్ధి పరచాలని ఆ గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. వెంకటరాజు నగర్ నుండి రేపల్లె వెళ్లేందుకు ఈ రహదారి మార్గం అత్యంత దగ్గరగా ఉంటుంది. ప్రధాన రహదారికి మార్గం కూడా ఇదే. రహదారికి ఇరువైపులా చెట్లు పెరిగి గుంటలతో రాత్రి సమయంలో రేపల్లె నుండి వెంకట్రావు నగర్ వెళ్లడానికి బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తుందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలన చివరి దశలో సూర్యపల్లి పంచాయతీలోని రాజవారిపాలెం గ్రామ రహదారి అభివృద్ధికి సిసి రహదారి నిర్మాణానికి ఆనాటి పాలకులు శ్రీకారం చుట్టారు. కానీ ప్రభుత్వ మారటంతో ఆ రహదారి పనులు నిలిచిపోయి అస్తవ్యస్తంగా మారింది. అదే రీతిలో కోనేటిపురం పంచాయతీలోని పడమటపాలెం గ్రామానికి వెళ్లే రహదారి సైతం గుంటలు పడి రాకపోకులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలవైపే తప్ప అభివృద్ధిపై దృష్టి సారించ లేదనటానికి ఈ రహదారులే నిదర్శనమని ఆ గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ప్రభుత్వం మారితే ఈ సారైన రహదారులు బాగుపడతాయేమోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు సత్కారం

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - చీరాల

రోటరీ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనం నందు రోటరీ ప్రతినిధి దోగుపర్తి వెంకట సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన తుమ్మలపెంట ప్రవళిక అనే బాలిక, తల్లి దండ్రులను బుధవారం సన్మానించారు. ఆమెకు జ్ఞాపిక, స్వీట్ పాకెట్‌తోపాటు రూ.5,616 నగదు పారితోషికం అందజేశారు. మండలంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 10మంది బాల, బాలికలను సన్మానించారు. వారికి జ్ఞాపిక, స్వీట్ పాకెట్, పుష్పగుచ్ఛం అందజేసి ఒక్కరికి రూ.వెయ్యి నగదు పారితోషకం అందజేసి అల్పాహారం ఏర్పాటు చేశారు. రామస్తంభం నందు పేదలకు అన్నదానం చేసేందుకు ఒక బస్తా బియ్యం ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాల్లో బాలింతలకు అన్నదానంకు వూర మస్తానరావు ట్రస్టు ద్వారా రూ.2500 అందజేశారు. మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, చారగుళ్ల గురు ప్రసాద్, బి హేమంత్ కుమార్, మేడూరి శేషసాయి పాల్గొన్నారు.

డ్రైనేజీలు లేక ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామాల్లో మురిగు నీటిపారుదల వ్యవస్థ లేక గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో మురుగనీటి పారుదలకు సరైన మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మేజర్ పంచాయతీలో ఉన్న మైలవరం గ్రామంలో ఏ కొద్దిపాటి వర్షం కురిసిన రహదారులు జలమయం అవుతూ ఉంటాయి. గ్రామ ప్రధాన రహదారి సైతం వర్షపు నీరు నిలబడి ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. భారీ వర్షం పడితే ప్రధాన రహదారిలో నిలబడిన నీరు సుమారు రెండు, మూడు రోజుల పాటు నిల్వ ఉంటుంది. నీరు తగ్గాక దానిలో ఆకులు, అలములు కుళ్ళి దుర్వాసన వెదగజల్లుతుంది. గ్రామంలో నుండి బయటకు మురుగునీరు పారటానికి సరైన కాలువల వ్యవస్థ లేదు. వర్షపు నీరు రహదారిపై పారుతూ సమీపంలోని వేణుగోపాలస్వామి దేవస్థాన చెరువులోకి మల్లుతుంది. చెరువు నిండిన అనంతరం చెరువులో నుండి బయటకు వెళ్లేందుకు సరైన పారుదల వ్యవస్థ లేదు. దీంతో చెరువు పూర్తిగా నిండిపోయి చుట్టుపక్కల గృహాల్లో కూడా నీరు వెళ్లి ముంపుకు గురిచేస్తుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామంలో మురుగునీటి వ్యవస్థపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. చెరువు పూర్తిగా నిండిపోయి పక్కనే ఉన్న సాగు భూమి సైతం నీట ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. ఈ గ్రామానికి మాచర్ల వారి చెరువు నుండి ఒక ప్రక్క మురుగు నీటి కాలువ ఏర్పాటు చేసి దానిని దేవస్థానం చెరువు వరకు మాత్రమే వదిలేశారు. ప్రధాన కూడలిలో కూడా ఎలాంటి పక్కా

మురుగు పారుదల అయ్యే కాలువ

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. ఎంత మంది పాలకులు మారినా మురుగు నీటిపారుదల వ్యవస్థపై దృష్టి సారించడంలేదు. దీంతో ప్రతి ఏట అధిక వర్షాల సమయంలో గ్రామం మురుగు నీటితో ముంపుకు గురవుతుంది. మురుగుతో ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మురుగు నీరు చేరుకునే దేవస్థాన చెరువు ప్రారంభం నుండి దళిత వాడ చర్చి వరకు పక్కా డ్రైనేజీని నిర్మిస్తే తప్ప డ్రైనేజీ వ్యవస్థ బాగుపడే పరిస్థితి లేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. మండల కేంద్రం భట్టిప్రోలులో గత ప్రభుత్వాల పాలనలో నిర్మించిన మురుగునీటి కాలువలు నేటి తొట్టులుగా మారి ఎక్కడికి అక్కక్కడ నీరు నిలబడి దోమల వృద్ధికి కారణమవు తున్నాయి. దీనిని కూడా ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు మురుగునీటి పారుదల వ్యవస్థపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రావెల్ బస్సులతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం

ట్రావెల్ బస్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ట్రావెల్ బస్సులు రోడ్డుకు అడ్డ దిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలిగి వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ట్రావెల్ బస్సులు రోడ్డుకు ఇరువైపులా ఉండటంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనాలన్నింటికీ ప్రతిరోజు అసౌకర్యంగా మారింది. దీంతో సాయంత్రం సమయంలో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులకు తలనొప్పిగా మారింది. ఓ వైపు రైల్వే గేటు పడిన సమయంలో వాహనాలు బారులు తీరుతాయి. మరో వైపు ట్రావెల్ బస్సులు అక్కడ ప్రధాన రహదారిపైన రోడ్లకు ఇరువైపులా ఇష్టారీతిగా నిలిపేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో దూర ప్రాంతాలను నుండి వచ్చిన వారు తిరుగు ప్రయాణాలు చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ మరింతగా పెరిగింది. ట్రావెల్స్ బస్సుల యజమానులను ప్రశ్నించే వారు లేకపోవటంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

నగదు అందజేస్తున్న గాదె మధుసూదనరెడ్డి

సాంఘిక నాటకానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బాపట్ల

పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీ యువకులు నిర్వహించబోవు సాంఘిక నాటకానికి తన వంతుగా రూ.60వేలు ఆర్థిక సహాయాన్ని వైసిపి నాయకులు, రేపల్లె నియోజకవర్గం వైసిపి ఎన్నికల పరిశీలకులు గాదె మధుసూధనరెడ్డి అందజేశారు. నాటక రంగాన్ని, సామాజిక అంశాలను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ యువకులు గోవతోటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఏలూరి సాంబశివరావు

ఎమ్మెల్యే ఏలూరి పరామర్శ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్దదర్శి గ్రామానికి చెందిన ముప్పరాజు కేత్రి శ్రీ సాయి కుటుంబ సభ్యులను టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు బుధవారం రాత్రి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విజయ బావుటా ఎగుర వేస్తాం

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయ బావుటా ఎగురవేయ బోతుందని, ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బాలినేని విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ ొడ్డి సంక్షేమ పాలనకు ప్రజలు మొగ్గుచూపినట్లు స్పష్టంగా తెలు స్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎక్కువ శాతం మంది చంద్రబాబు నాయుడును నమ్మినట్లు లేరని, పలు ఉద్యోగ సంఘాల నాయకులు తనతో అన్నట్లు పేర్కొన్నారు. బకాయిలు చెల్లిం చడంలో కొంత ఆలస్యం అయినా జగన్ మోహన్‌రెడ్డే నయమని ఉద్యోగులు చెబుతు న్నారని వివరించారు. ఏది ఏమైనా ఎన్నికల్లో మండుటెండను సైతం లెక్క లేయకుండా తనతోపాటు ప్రయాణం చేసి, కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, తనను ప్రోత్సహించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో పాలుపంచుకున్న అధి కారులు, సిబ్బందికి బాలినేని ధన్యవాదాలు తెలిపారు.

ఎపిఆర్‌జెసిలో సుమశ్రీకి 272వ ర్యాంకు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన కందుకూరి సుమశ్రీ బుధవారం ప్రకటించిన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో 272వ రాంక్ సాధించి తన సత్తా చాటింది. 10వతరగతి పరీక్షా పలితాల్లో 587 మార్కులతో జిల్లాలో మూడవ స్థానం, మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పాలిటెక్నిక్‌లో 243వ ర్యాంకు సాధించింది. ఎపిఆర్‌జెసి ఫలితాల్లో 272వ ర్యాంకు సాధించి తన ప్రతిభ చూపింది. పేద కుటుంబానికి చెందిన సుమశ్రీ చెందిన మొదటి నుండి చదువులో చురుకైన పాత్ర పోషిస్తుంది. ఎపిఆర్‌జెసి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన సుమశ్రీని ప్రధానో పాధ్యాయుడు బి. శివరామ ప్రసాద్, గ్రామస్తులు అభినందించారు.

దాడి చేసిన వారిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : దామచర్ల

బాధితులకు పరామర్శ

మాట్లాడుతున్న దామచర్ల జానార్ధన్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వెంగముక్క పాలెం పోలింగ్ కేంద్రంలో స్థానికులపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు డిమాండ్ చేశారు. వైసిపి నేతల దాడిలో గాయపడిన బాధితులను దామచర్ల బుధవారం పరామర్శించారు. కేసు పురోగతిపై దామచర్ల పోలీసులను ప్రశ్నించారు. వైసిపి నేతల దాడిలో పోలింగ్ కేంద్రంలో పగిలి పోయిన కిటికీ అద్దాలు జనార్ధనరావు పరిశీలించారు. దాడి చేసిన వారిపై బాధితులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని దామచర్ల ప్రశ్నించారు. పోలీసులు కూడా వైసిపి నేతలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మీడియాతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున వెంగముక్కపాలెం పోలింగ్ కేంద్రంలోకి వైసిపి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాస రెడ్డి వెళ్లినట్లు తెలిపారు. ఆయనతో పాటు బాలినేని కుమారుడు ప్రణీత్ రెడ్డి, కోడలు కావ్య రెడ్డి వచ్చారన్నారు. దీంతో టిడిపి ఏజెంట్లు, స్థానికులు పోలింగ్ బూత్‌లోకి అభ్యర్థి కాని బాలినేని ప్రణీత్ రెడ్డి, కావ్య రెడ్డి ఎలా వస్తారని ప్రశ్నించారు. దీంతో వారు అక్కడ నుంచి వెళ్ళిపోయారని తెలిపారు. సాయంత్రం సమయంలో కావ్య రెడ్డి మరో 10 మందితో కలసి ప్రశ్నించిన వారిపై దాడి చేశారన్నారు. బాలినేని కావ్య రెడ్డి చెప్పుతో బాధితులను కొట్టిన వీడియోలు తమ వద్ద ఉన్నాయన్నారు. సమతా నగర్ ఘటనలో తమ కుటుంబం జోలికి వచ్చారని, చూస్తు ఊరుకోమని చెప్పిన బాలినేని శ్రీనివాస రెడ్డి వెంగముక్కలపాలెంలో ఆయన కోడలు ఎస్‌సిలపై దాడి చేశారని ఇందుకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడిలో పాల్గొన్న బాంబుల సాయి, బబ్లూతో పాటు కావ్య రెడ్డి, ఇతరులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం లోపు దాడి చేసిన 14 మంది నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే డిఎస్‌పి కార్యాలయం లేదా జిల్లా ఎస్‌పి కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని దామచర్ల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వై.శశికాంత్ భూషణ్, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, రాచగర్ల వెంకట్రావు, కొఠారి నాగేశ్వరరావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసులు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు మలగా రమేష్, చుండి శ్యామ్, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, మండువ లావణ్య, కె.కుసుమ కుమారి, షేక్ ఆరీఫా, ఆర్ల వెంకటరత్నం మంగపాటి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవికాస్'కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

నవీన్

కె.జ్యోత్స్నతేజ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్(ఎపిఆర్‌జెసి) ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఒంగోలులోని శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు దక్కాయి. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న కొండపి గ్రామానికి చెందిన కె.జ్యోత్స్నతేజ 110 మార్కులతో 115 ర్యాంకు సాధించింది. కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన చాపల నవీన్ 119 మార్కులతో స్టేట్ 174వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ పి.వీరయ్య మాట్లాడుతూ తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 15 మంది విద్యార్థులు 500 లోపు ర్యాంకులు సాధించారన్నారు. 25 మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. అభినందించారు.

ఓట్లు వేసేందుకు బారులు మహిళలు (ఫైల్)

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

స్టాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌సి వకుల్ జిందాల్ బుధవారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ను సందర్శించి 6 నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజ్ ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికల కౌంటింగ్ సమయంలో కౌటింగ్ హాలుల వద్ద తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, బారికేడ్ల ఏర్పాటు, కౌంటింగ్ హాలులోకి ఏజంట్లు వెళ్లేందుకు , వచ్చేందుకు మార్గాల ఏర్పాటు తదితర విషయాల గురించి పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు (ఐటీబీపీ), రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, మూడో అంచెలో సివిల్ పోలీసులను ఏర్పాటు చేశారు. ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లు, సెక్యూరిటీ, కారిడార్, సీల్డ్ వేసిన డోర్‌లను కవర్ చేసే విధంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయబడిన సీసీ టీవీ కవరేజీతో సహా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ అధికారులతో పాటు, పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ ఎంట్రెన్స్ గేట్ లోపలికి , పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు లేదా అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలకు అనుమతించరాదన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు , వారి ఏజెంట్లను వారి పరిధి వరకూ మాత్రమే అనుమతించాలని పోలీస్ అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవ హరించాలన్నారు. ఎవరైనా విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్ , బాపట్ల డిఎస్‌పి మురళీకష్ణ , ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి, బాపట్ల రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీహరి, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా ,,

'దర్శి'లో 90.99 శాతం పోలింగ్

ప్రజాశక్తి-దర్శి

గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలోనే దర్శి నియోజకవర్గంలో 90.99 పోలింగ్ నమోదు కావడం రికార్డు సష్టించింది. 2019 ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటర్లను చైతన్య పరించారు. వైసిపి అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియోజక వర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో మన ఊరికి మన శివన్న అనే కార్యక్రమం పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా టిడిపి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి కూడా గ్రామాల్లో పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి శివ ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దర్శిలో రోడ్ షో నిర్వహించారు. వెంకటాచలం లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మద్దతుగా టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుఎన్నికల సభ నిర్వహించారు. హైదరాబాదు, బెంగళూరు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లును ఇరుపార్టీల వారు రప్పించారు. ఓటర్లు నగదు పంపిణీ చేశారు. దీంతో ఉదయం 7 గంటల నుం రాత్రి 12 గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. నియోజక వర్గంలో మొత్తం 2,26,370 ఓటర్లు ఉన్నారు. అందులో 20,5,993 మంది తమ ఓట్లు వినియోగించుకున్నారు. దీంతో 90.99 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ నమోదైన నియోజక వర్గంగా దర్శి నిలిచింది.